## క్లుప్తంగా

### శాకంబరీ రూపంలో నిమిషాంబ దేవి



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరంలోని 16వ డివిజన్ కీర్తినగర్‌లో నిమిషాంబ దేవి ఆదివారం శాకంబరీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు లక్ష్మీ నర్సింహాచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్‌వర్మ, కె.సురేశ్, సంతోష్‌బాబు, విజయరాజ్, సునీల్‌కుమార్, సంజయ్‌కుమార్, రమేశ్, రాందాసు, వెంకటేశ్వర్లు, సుగుణాకర్, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మినృసింహుహుడికి లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన పూజలు చేస్తున్న అర్చకులు

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో తొలిఏకాదశి పండుగ సందర్భంగా ఆదివారం స్వామివారికి 108 కలశాలతో అభిషేకం, లక్ష పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు కాండూరి రామాచార్యులు, విష్ణు, ఫణీంద్ర, ఆలయ మాజీ ఉత్సవ కమిటీ సభ్యులు వీరాటి లింగారెడ్డి, రవీందర్‌రెడ్డి, కడారి రాజు, సాయిలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఐక్యంగా ఉద్యమిస్తేనే హక్కులు సాధించుకుంటాం'



జెండావిష్కరిస్తున్న పల్లకొండ భిక్షపతి

సంగెం : ఏకలవ్య కులస్తులందరూ ఐక్యంగా ఉండి ఉద్యమిస్తేనే హక్కులు సాధించుకుంటామని ఏకలవ్య సంఘం మండల అధ్యక్షుడు పల్లకొండ భిక్షపతి పిలుపునిచ్చారు. ఆదివారం ఏకలవ్య జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు సమ్మయ్య, మల్లయ్య, నాగరాజు, భిక్షపతి, అరవింద్, కుమారస్వామి, ఎల్లయ్య, మమత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

### వర్షాలు కురవాలని ఉయ్యాల ఆట



నర్సంపేట : వర్షాలు కురవాలని మహిళలు ఉయ్యాల ఆటను ఆడారు. చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో మహిళలు ఆదివారం ఉయ్యాల పాటలు పాడుతూ ఆడిపాడారు. వరుణ దేవుడా కరుణించి వర్షాలు సమృద్ధిగా కురిపించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పడిదం నర్సమ్మ, రాధ, కరుణ, కవిత, వినోద, కలమ్మ, రవళి, రజని, మౌనిక, సుప్రియ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

### మద్యానికి బానిసై వృద్ధుడి ఆత్మహత్య



మృతి చెందిన వాగ్య

గీసుకొండ: మద్యానికి బానిసైన వృద్ధుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని హర్జ్యతండాకు చెందిన బోడ వాగ్య(63) భార్య 25ఏళ్ల క్రితం చనిపోయింది. ఆ తర్వాత అతడు మద్యానికి బానిసై ఆదివారం తన చేను వద్ద ఉదయం పురుగుల మందు తాగడంతో బంధువులు అతడిని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

# ప్రమాదకరంగా గుంతలు

- సంగెం పెద్దవాగు బ్రిడ్జి వద్ద వాహనదారుల ఇబ్బందులు
- ఆర్ అండ్‌బీ అధికారులు పూడ్చివేయాలని ప్రజల విజ్ఞప్తి



సంగెం పెద్దవాగు బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గుంతలు

సంగెం: అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులు, వాహనదారులకు ప్రాణసంకటంగా పరిణమించింది. సంగెం మండల కేంద్రం నుంచి వరంగల్ నగరానికి వెళ్లే ప్రధాన రహదారిలోని పెద్దవాగు బ్రిడ్జి గుంతలు తేలి ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు వర్షపు నీరు నిల్వ ఉండడంతో గుంతల లోతు తెలియక పలువురు ద్విచక్రవాహనదారులు పడిపోతున్నారు. గత ఏడాది ఈ గుంతల్లో పడి గవిచర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. అనేక మంది ఆస్పత్రి పాలయ్యారు. ఆటోలు సైతం గుంతల్లో దిగబడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇలా ప్రమాదాలు జరగడంతో ఆటో యూనియన్ నాయకులు సొంతంగా గుంతలను పూడ్చుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో గుంతలు మళ్లీ పెద్దగా మారాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జి సమీపంలో ఉన్న లోలెవల్ కాజ్‌వే పొంగిపొర్లితే వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీనిపై పెద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునేవారు లేరని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెద్దవాగు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలతో పాటుగా మండల కేంద్రంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చివేసి ప్రమాదాలు జరుగకుండా నివారించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

### చాలామంది పడిపోతున్నారు



బ్రిడ్జి వద్ద గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. గుంతల్లో నీళ్లు ఉండడం వల్ల ఎంత లోతు ఉన్నాయో తెలియక చాలామంది పడిపోతున్నారు. వర్షాలకు రోజు రోజుకు గుంతలు పెద్దవవుతున్నాయి. అధికారులు గుంతలు పూడ్చివేయాలి.

– శ్రీరాముల యాకయ్య, తిమ్మాపూర్

### గుంతల్లో సీసీ వేయిస్తాం

నేను కొత్తగా ఇటీవలే చార్జి తీసుకున్నాను. బ్రిడ్జిపై గుంతలు పడిన విషయం మా దృష్టికి ఇంకా రాలేదు. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల బ్రిడ్జిపై బీటీ లేచిపోతున్నది కావొచ్చు. పరిశీలించి ఆ గుంతల్లో సీసీ వేయిస్తాం.

–రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఏఈ

# ఘనంగా తొలి ఏకాదశి ఉత్సవాలు



నర్సంపేట : పారాయణంలో పాల్గొన్న మహిళలు

నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేటలోని ద్వారక వేణుగోపాల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మూలవిరాట్ స్వామికి ఆదివారం పంచామృత అభిషేకం, విశ్వక్షేన కలశపూజ నిర్వహించారు. అనంతరం లక్ష పుష్పార్చన కార్యక్రమం, హోమ క్రతువు విశ్వశాంతికై వేద పండితులు ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల వెంకటాచార్యులు, శ్రీధరాచార్యులు, ఆలయ కమిటీ బాధ్యులు మధ్య పూజాధికాలు నిర్వహించారు. లక్ష్మీ అష్టోత్తర శ్రీవిష్ణు సహస్ర నామ పూజాదికలు నర్సంపేట వికాస తరంగిణిశాఖ సభ్యులు మహిళలు పారాయణం చేశారు. తొలి ఏకాదశి విశిష్టతను శయన ఏకాదశి అని, విష్ణుమూర్తి యోగనిద్రలోకి వెళ్తాడని, ఈ శుభ సమయంలో భక్తులు దీక్ష తీసుకుని భక్తితో ఉంటే శుభాలు చేకూరుతాయని అర్చకులు శ్రీధరాచార్యులు తెలిపారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు.

**వేంకటేశ్వరస్వామికి అభిషేక పూజలు**

పట్టణంలోని శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం తొలిఏకాదశి సందర్భంగా స్వామివారి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేక పూజలు నిర్వహించారు. లక్ష్మీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణములను మహిళా వికాస తరంగిణి భక్తులు పారాయణం చేశారు. అనంతరం స్వామివారి అలంకరణ ఆరగింపు తీర్థ ప్రసాదగోష్టి నిర్వహించారు. తొలి ఏకాదశి విశిష్టతను ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై రామానుజాచార్యులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, వేంశెట్టి శ్రీనివాస్, శింగిరికొండ రవీందర్, వీరయ్య, వేణు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని గ్రామాల్లోని పలు కుటుంబాలు పిండివంటలు చేసుకొని బంధుమిత్రులతో ఆనందంగా గడిపారు.

# వైభవంగా బీరన్న బోనాలు



దుగ్గొండి : గిర్నిబావిలో బీరన్న బోనమెత్తుకుని ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో బీరన్న పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ కులస్తులు బోనాలతో బీరన్న దేవాలయం వద్దకు వెళ్లి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా బీరన్న ఆలయం వద్ద గావు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. బీరన్న బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని బోనమెత్తారు. కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.హరిబాబు, శ్రీనివాస్, కురుమ కులస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుగ్గొండి: మండలంలోని పలు గ్రామాల్లో బీరన్న బోనాల పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండలవ్యాప్తంగా గొల్ల, కురుమలు తమ ఇళ్లలో బోనాలను అలంకరించుకుని డప్పు చప్పుళ్లు, డోలి వాయిద్యాల మధ్య ర్యాలీగా బయలుదేరి బీరన్న దేవాలయంలో మొక్కులు చెల్లించారు. గిర్నిబావిలో జరిగిన వేడుకలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బోనమెత్తుకుని ర్యాలీగా ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. తొగర్రాయిలో కురుమ కులస్తులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, కుల సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

### నివాళి



లక్ష్మి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పులి దేవేందర్, తదితరులు

దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి తల్లి లక్ష్మి ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందింది. ఈ మేరకు మృతదేహాన్ని 'మెపా' రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుమారుడు చిరంజీవిని ఓదార్చారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, చిరుత వెంకటేశ్వర్లు, సింగారపు రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్, పెండ్యాల కృష్ణ, పులి రాజేష్, పెండ్యాల యాదగిరి, తిరుపతి, రాజేందర్, రజినీకర్, ఉన్నారు.

### నేడు డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్

పరకాల : మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుష్మ తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు చేపట్టనున్న కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. 7993361942 నంబర్ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి ఫోన్ ద్వారా అందించాలని కమిషనర్ కోరారు.

# చెరువుల మరమ్మతుపై ఎమ్మెల్యే దృష్టి

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



చెరువుకట్ట మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి

నెక్కొండ : చెరువుల మరమ్మతుపై నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, అధిక నిధులు కేటాయించారని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని అలంకానిపేట చెరువుకట్ట అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ రైల్వేట్రాక్ ఎఫెక్టెడ్ నిధులు రూ. 10 లక్షలతో పనులు చేపట్టామన్నారు. దీంతో అటు చెరువు దెబ్బతినకుండా ఉండడంతో పాటు రైల్వేట్రాక్‌కు ఇక ముందు కూడా ముప్పు ఉండదని ఆయన చెప్పారు. అలాగే మండలంలోని టీకుల కుంట (టీకే) తండా జీపీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనంతరం మండలంలోని అప్పల్‌రావుపేట మాజీ ఎంపీటీసీ ఊడ్గుల వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. వెంకటేశ్వర్ల ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే దొంతి దృష్టికి తీసుకెళ్తామన్నారు. పార్టీ ఆయనకు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నర్సంపేట ఏజీపీ బండి శివకుమార్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, సాయికృష్ణ, శ్రావణ్‌కుమార్, కిష్టయ్య, ప్రశాంత్, కనకయ్య, నరేశ్, మహిపాల్‌రెడ్డి, రమేశ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెకు ఆర్‌ఎస్‌పీ మద్దతు

పర్వతగిరి : ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 9 న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఆర్ఎస్‌పీ మద్దతు ప్రకటించినట్లు రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 11 ఏళ్లుగా కార్మిక, కర్షక, రైతు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు మోదీ ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయడం లేదని, కార్మికుల హక్కుల సాధన కోసం రైతుల సంక్షేమం కోసం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి మోదీ ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నర్సంపేట : ఈనెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బహుజన రాజ్యాధికారం పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శులు బుర్రి సాగర్, అంకేశ్వరపు రమేష్‌లు ఆదివారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# శ్యామాప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గీసుకొండ : దేశ ఐక్యతకు కృషి చేసిన జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జీవితాన్ని, ఆయన చూపిన మార్గాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కుసుమ సతీష్‌బాబు అన్నారు. ఆదివారం గ్రేటర్‌లోని 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శ్యామాప్రసాద్‌ముఖర్జీ 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎరుకల రఘునారెడ్డి, మాచర్ల దీన్‌దయాల్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి, నాయకులు బైరి మురళీకృష్ణ, గోదాసి అశ్వినికుమార్, మాదాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లోని 15వ డివిజన్ గొర్రెకుంటలో శ్యామాప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు శివకుమార్, నాయకులు ల్యాదల్ల ప్రభాకర్, బిల్ల రమేశ్, కందుల రాజేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. భారత దేశం ఐక్యత కోసం, సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ వ్యక్తి డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పు రాజు, నాగరాజు, రాజశేఖర్, సుమన్, రాజేష్, రమేశ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

# బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

- తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఇల్లంద మేనేజర్ సౌజన్య



వీఓఏలతో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ సౌజన్య, కొమురయ్య

వర్ధన్నపేట : బ్యాంకు ద్వారా రుణాలు పొందిన సంఘాల సభ్యులు నిర్ణీత వాయిదాలను సకాలంలో చెల్లించేలా వీఓఏలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఇల్లంద మేనేజర్ సౌజన్య, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్యలు సూచించారు. ఆదివారం మండలంలోని ఇల్లందలో సీబీఆర్ఎం (కమ్యూనిటీ బేసిడ్ రికవరీ మెకానిజం) నెలసరి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆస్తుల కల్పన కృషి చేయాలన్నారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను మరింత ప్రోత్సహించాలని లక్ష్యంతో వడ్డీ లేని రుణాలను అందిస్తామన్నారు. అంతేకాకుండా ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం ద్వారా ప్రత్యేక రుణాలు ఇప్పించి ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సదావకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. సమావేశంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ధనలక్ష్మి, వీఓ ప్రతినిధులు స్వప్న, వీఓఏలు శోభ, కత్తి స్రవంతి, పద్మావతి, ఆకుల స్రవంతి, రమ, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పీరీల ఊరేగింపు



అగ్నిగుండం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రాయపర్తి: వెంకటేశ్వరపల్లిలో పీరీలతో నాయకులు, గ్రామస్తులు

నర్సంపేట : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను గ్రామాల్లోని ముస్లిం, హిందువులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం చెన్నారావుపేట, లింగాపురం, ఉప్పరపల్లి, బోజెరువు, తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ పీరీలను ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున కుడుకలు, దట్టీలు, బెల్లం, ఊదులను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం అషూర్‌ఖానా(పీరీలు ప్రతిష్ఠించిన ఆలయాలు) ముందు తీసుకొని అలాం(అగ్నిగుండం)లో ఒక కుండలో పాలు పోసి పొంగించి ప్రత్యేక పూజలను నిర్వహించి అగ్ని గుండాలను పూడ్చివేశారు. అనంతరం అగ్ని గుండాల వద్ద పండ్ల మొక్కను నాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీరీలను నీటిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ అయ్యూం, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రఫీ, చెన్నారావుపేట మాజీ జెడ్పీటీసీ జున్నుతుల రాంరెడ్డి, కంది కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కుండె మల్లయ్య, హంస విజయరామరాజు, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు నన్నెబోయిన రమేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలకేంద్రంతో పాటు మండలంలోని పెర్కవేడు, కాట్రపల్లి, కొండూరు, కొత్తూరు, వెంకటేశ్వరపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీలను ఊరేగించారు. ముస్లిం యువతులు ఆటలాడుతూ సంబురాలను నిర్వహించారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

**మొహర్రం ఉత్సవాలకు చేయూత**

మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో మొహర్రం పండగ ఉత్సవాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూతనందించినట్లు మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ ముస్లింల వినతి మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అందించిన రూ.5వేలను ముస్లింలకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, పార్టీ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ యూసుఫ్, దోకుడు దేవేందర్, ఎల్లస్వామి, అశోక్, చిలువేరు సాయి, గూబ ఎల్లయ్య, యాకమచారి, సామ్రాట్, పొన్నం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యం



పొక్లెయినర్ సహాయంతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఎస్సై చందర్‌నాయక్

వర్ధన్నపేట : ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యమని వర్ధన్నపేట ఎస్సై భూక్య చందర్‌నాయక్ అన్నారు. మండలంలోని వరంగల్–ఖమ్మం నేషనల్ హైవే 563 సంగపు వాగు బ్రిడ్జి, ల్యాబర్తి –వర్ధన్నపేట హైవే ఎక్కే దగ్గర మలుపు వద్ద బ్రిడ్జికి ఇరువైపులా భారీగా పెరిగిన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలతో ఈ దారుల్లో వెళ్లే ప్రయాణిస్తున్న ప్రజలకు దారి సరిగ్గా కనిపించకుండా ఇబ్బందులకు గురువుతున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. దీంతో ఆ ప్రాంతానికి సందర్శించిన ఎస్సై ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో ప్రమాదాలు జరిగే అస్కారం ఉందని గ్రహించి మానవ దృక్పదంతో తన సొంత ఖర్చులతో పొక్లయినర్ ఏర్పాటు చేయించి మొక్కలను తొలగింపజేశారు. ఎస్సైని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### నేడు శ్రీవాణి సంతాప సభ

పరకాల : రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న శ్రీవాణి సంతాప సభ సోమవారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని ఓ గార్డెన్‌లో జరగనున్న సంతాప సభకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు.

**జగ్జీవన్‌రామ్ వర్ధంతి**

పరకాల : సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం మండలంలోని మల్లక్‌పేట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు దాస్, శంకర్, చార్లెస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామం వరంగల్–ఖమ్మం రహదారికి అనుకుని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను తొలగించాలని ఆదివారం రైతులు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓ వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా నల్లమారమ్మ వాగు బ్రిడ్జి వద్ద అక్రమంగా ఫంక్షన్‌హాల్ నిర్మించినట్లు ఆరోపించారు. ఈ నిర్మాణంపై కోర్టు తీర్పును అధికారులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇట్టి నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో ఉండగా నిర్మాణాల కూల్చివేతకు సంబంధించి గ్రామపంచాయతీ అధికారులు మూడు సార్లు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. అయినప్పటికీ అక్రమ నిర్మాణాలు కూల్చివేయలేదని వాపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకుని భూములు, పంటలు కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేశారు. రాస్తారోకో నిర్వహించిన వారిలో విక్రమ్‌రావు, భాస్కర్‌రావు, యాకయ్య, పూర్ణచందర్‌రావు, కుమారస్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.